క్లుప్తంగా

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి



రామచంద్రరావు కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్ : పోలీస్ శాఖలో పనిచేస్తోన్న సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, వారి కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. అనారోగ్య కారణాలతో ఎస్సై రామచంద్రరావు మృతిచెందడంతో ఆయన భార్య కె.వెంకటేశ్వరమ్మకు ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో రూ.1 లక్ష కార్పస్ ఫండ్ నుంచి చెక్‌ను ఎస్పీ అందజేశారు. ఏదైనా సమస్య ఉంటే వాటిని తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ముగిసిన నాయకత్వ శిక్షణ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల సాంఘిక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల నాయకత్వ శిక్షణ శనివారం ముగిసింది. సామాజిక శాస్త్ర విభాగాధిపతి రత్నమేరి స్వాగత ప్రసంగంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ నాయకత్వ శిక్షణ ఆవశ్యకతను, ప్రాముఖ్యతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ మరియ క్రిస్టియ మాట్లాడుతూ జ్ఞానం అనే సంపదను కూడబెట్టుకొని అవసరార్థం వాడుకోవాలని సూచించారు. ఫోరమ్ ఆఫ్ ఫ్రీ ఎంటర్‌ప్రైజెస్, ముంబైకి చెందిన రిసోర్స్ పర్సన్లు వివేక్ పాటక్, క్లారిసా జాతన్నలు టైమ్ మేనేజ్మెంట్, గోల్ సెట్టింగ్, పాజిటివ్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్ వంటి అంశాల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ మెర్సీ, అతిథులు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఆదిత్య కళాశాల విద్యార్థి నాయకులతో పాటు, ఇతర స్థానిక కళాశాలల విద్యార్థులు, సాంఘిక శాస్త్ర విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎఫ్ఏ-2 పరీక్షలు వాయిదా

నిడమర్రు: పాఠశాలల్లో ఈనెల 21 నుంచి నిర్వహించాల్సిన సెల్ఫ్ ఎస్సెస్మెంట్ మోడల్ పేపరు-2 (ఎఫ్ఏ-2) పరీక్షలు నవంబరు నెలకు వాయిదా పడినట్లు ఎంఈఓ పుచ్చల శేషు అన్నారు. ఈ పరీక్షలు నవంబరు 4 నుంచి 7వ తేదీ వరకు, రోజుకి రెండు పరీక్షల చొప్పున నిర్వహిస్తారని తెలిపారు. తుఫాన్ల కారణంగా కొన్ని జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పరీక్షలు వాయిదా వేసినట్లు చెప్పారు.

వరుస చోరీలు.. ప్రజల గగ్గోలు

- ఏలూరులో పోలీస్ గస్తీ, నిఘా వైఫల్యం
- ప్రధాన రహదారుల్లోనే పోలీస్ హడావుడి
- ఆలయాలనూ వదలని దొంగలు



రామకోటిలోని రామమందిరంలో చోరీ ఘటనపై పోలీస్ విచారణ (ఫైల్)



చొదిమెళ్లలో ఇంట్లో చోరీని పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ (ఫైల్)

ఏలూరు టౌన్ : ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో తాళాలు వేసిన ఇల్లు కనిపిస్తే చాలు, దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లోని విలువైన బంగారు, వెండి, నగదు అపహరిస్తున్నారు.. నగరంలో మోటారు సైకిళ్లను ఎక్కడ దాచుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. సెల్‌ఫోన్లు, మహిళల మెడలోని బంగారు ఆభరణాలకు రక్షణ కరువైంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడు నెలల కాలంలోనే నేరస్తులకు రెక్కలు వచ్చాయనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. పదుల సంఖ్యలో ఇళ్ల దొంగతనాలు, మోటారు సైకిళ్ల చోరీలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయని జనం గగ్గోలు పెడుతున్నారు.

పోలీస్ గస్తీ, నిఘాపై అసంతృప్తి

ఏలూరు నగరంలో పోలీస్ గస్తీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇక నిఘా వైఫల్యంతో నేరాలకు అడ్డుకట్టవేయలేని స్థితిలో పోలీస్ అధికారులు నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలో నిత్యం నేరాలు జరుగుతున్నా, వాటిని ముందే పసిగట్టి పోలీస్ బాస్‌కు, అధికారులకు సమాచారం ఇవ్వాల్సిన నిఘా బృందాల పనితీరుపై అసంతృప్తి నెలకొంది. రాత్రి వేళల్లో వరుసగా చోరీలు జరుగుతున్నా, వాటికి అడ్డుకట్ట వేయలేని స్థితిలో పోలీస్ అధికారులు ఉంటున్నారని జనం వాపోతున్నారు. ఆఖరికి ఆలయాల్లోనూ చోరీలు చేస్తూ పోలీసులకే దొంగలు సవాల్ విసురుతున్నారా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏలూరులో రెచ్చిపోతున్న దొంగలు!

- వన్‌టౌన్‌లోని రామకోటి ప్రాంతంలో రామమందిరంలో సీతమ్మ మెడలో బంగారు మంగళ సూత్రాల్ని దొంగలు అపహరించారు. రూ.5 వేలు నగదు, కిలోన్నర వెండి వస్తువులను కాజేశారు.
- చొదిమెళ్ల గ్రామంలో తాళాలు పగులగొట్టి ఇంట్లోని రూ.80 వేలు నగదు, బంగారు, వెండి వస్తువులు చోరీ చేశారు.
- ఏలూరు శాంతినగర్ 2వ రోడ్డులో తాళాలు వేసి, పక్కనే బంధువుల ఇంట్లో పడుకుని తెల్లవారి లేచి చూసేసరికి ఇంట్లోని ఏడు తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు దొంగలు అపహరించుకుపోయారు.
- ఏలూరు రూరల్ ప్రాంతంలో జాతీయ రహదారిపై రత్నాస్ దాబా వద్ద దుర్గమ్మ గుడికి వెళ్లి వస్తూ మార్గమధ్యంలో కారులోనే సేదదీరుతోన్న మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు.
- టూటౌన్ చోడిదిబ్బ ప్రాంతంలో ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని నగదును అపహరించారు.
- టూటౌన్ కొత్తపేట ప్రాంతంలో తాళాలు వేసిన ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి వస్తువులు దోచుకెళ్లారు.
- కొత్తబస్టాండ్‌లో ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు గ్రామానికి చెందిన అల్లాడ లక్ష్మి తన కుమార్తె ఇంటికి వెళ్లేందుకు బస్సు కోసం వేసి ఉండగా దొంగలు ఆమె పర్సును అపహరించారు. అందులోని రూ.72 వేలు నగదు, బంగారు రింగు ఉన్నట్టు బాధితురాలు ఫిర్యాదు చేసింది.
- త్రీటౌన్ పరిధిలో శాంతినగర్ 12వ రోడ్డులో నివాసం ఉంటోన్న బ్యాంకు ఉద్యోగి హాస్పిటల్ పనిమీద హైదరాబాద్ వెళ్లి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 15 కాసుల బంగారు ఆభరణాలు, 10 కిలోల వెండి వస్తువులు కాజేశారు.

సైరన్ వేస్తే మమ అనిపిస్తున్నారు

ఏలూరు నగరంలోని ప్రధాన రహదారుల్లో మాత్రమే పోలీస్ అధికారులు హడావుడి చేస్తున్నారని, నేరాలకు పాల్పడే వారిపై సరైన నిఘా లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏలూరు ఆర్‌ఆర్‌పేట, ఎన్‌ఆర్‌పేట, కొత్తబస్టాండ్, ఏలూరు జీజీహెచ్ రోడ్డు, ఫైర్‌స్టేషన్ సెంటర్, పాతబస్టాండ్, వన్‌టౌన్‌లోని ప్రధాన రహదారుల్లో పోలీసు అధికారులు సైరన్‌లు వేసుకుంటూ తిరుగుతూ కాలక్షేపం చేస్తున్నారనే అపవాదు ఉంది. ప్రధాన రోడ్లలోని దుకాణాలు, షాపులు, హోటల్స్ మూయించటమే లక్ష్యంగా పెట్టుకుంటూ పోలీసులు తూతూ మంత్రంగానే విధులు నిర్వర్తిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో ఉంది.

పోలీస్ గస్తీ మరింత పటిష్టం



ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో చోరీల నివారణకు నిఘా, గస్తీని మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టాం. నగరంలో ప్రజలకు లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)పై అవగాహన కల్పిస్తున్నాం. ఏలూరు నగరం, డివిజన్‌లోని ప్రజలు ఏదైనా పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన సమయంలో చోరీల నివారణకు ఎల్‌హెచ్‌ఎంఎస్ విధానాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాం. రాత్రివేళల్లోనూ పోలీసు గస్తీని మరింత పెంచుతూ నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో తిరిగేలా బీట్లు వేస్తున్నాం.

– డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు డీఎస్పీ

స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌తో సైబర్ నేరాల నుంచి రక్షణ



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సైబర్ నేరగాళ్ల బారి నుంచి రక్షించుకునేందుకు ఫోన్ స్ట్రాంగ్ పాస్‌వర్డ్ ఒక ఆయుధమని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు అన్నారు. స్థానిక సెయింట్ థెరిసా మహిళా కళాశాలలో విద్యార్థినులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పాస్‌వర్డ్‌ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు పంపే లింకులు లేదా మెస్సేజులకు స్పందించవద్దన్నారు. గూగుల్, ఫేస్‌బుక్, జీమెయిల్, ఇన్‌స్టాగాం, ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ ఇలా అన్నింటికీ ఒక్కటే పాస్‌వర్డ్ పెట్టుకుంటున్నారని, ఒక్కదాని పాస్‌వర్డ్ తెలిస్తే అన్ని ఖాతాల గుట్టు సైబర్ కేటుగాళ్ల చేతికి చిక్కుతుందని వివరించారు. పుట్టిన తేదీ, పెళ్లి రోజు, పిల్లలు, భాగస్వామి పేర్లు వంటివి పాస్‌వర్డ్స్‌లో పెట్టుకోవద్దని సూచించారు. పాస్‌వర్డ్ కచ్చితంగా 8 అంకెల కంటే తక్కువ ఉండకూడదని, అక్షరాలతో పాటు నెంబర్లు, గుర్తులను జత చేయాలని, ప్రతి మూడు నెలలకోసారి పాస్‌వర్డ్‌ని రీ సెట్ చేసే అలవాటు చేసుకోవాలని అన్నారు. సైబర్ క్రైమ్ బారిన పడినవాళ్లు సహాయం కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్ లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా ఎస్సై కాంతి ప్రియ, ఏలూరు సైబర్ సెల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మధు వెంకట రాజా కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఏలూరు నగరంలో కార్డెన్ సెర్చ్



గన్‌బజార్ ప్రాంతంలో తనిఖీ చేస్తున్న సీఐలు కోటేశ్వరరావు, రమణ



కబాడీగూడెంలో పరిశీలన చేస్తున్న సీఐ వైవీ రమణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో నేరాల నిరోధానికి పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో సీఐలు జి.సత్యనారాయణ, వైవీ రమణ, కోటేశ్వరరావులు టూటౌన్‌లోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. గన్‌బజార్, బంగారు నాగన్న వీధి, కబడ్డీగూడెం యానాదుల కాలనీల్లో తనిఖీలు చేశారు. ఇళ్లలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానితులు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. కార్లు, మోటారు సైకిళ్లు ఇతర వస్తువులు, రికార్డులను, వ్యక్తిగత సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. నగరంలో నేరాల అదుపునకు, నేరస్తుల కదలికలు, వారిని గుర్తించేందుకే దాడులు చేపట్టామని పోలీస్ అధికారులు తెలిపారు. నగరంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

ఏలూరు టౌన్: హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా ప్రాణానికి రక్షణ ఏర్పడుతుందని టూటౌన్ సీఐ వైవీ రమణ అన్నారు. ఏలూరు టూటౌన్ ప్రాంతంలో శనివారం సాయంత్రం మోటారు సైకిళ్ల తనిఖీ, విజిబుల్ పోలీసింగ్, హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ రమణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్న సమయంలో హెల్మెట్ రక్షణగా నిలుస్తుందని ద్విచక్ర వాహనచోదకులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సెల్‌ఫోన్లు మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు.

డిస్టెన్స్ స్టడీ, ఎగ్జామ్స్ సెంటర్‌ను రద్దు చేయాలి



డిస్టెన్స్ ఎగ్జామ్స్ కోఆర్డినేటర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక ఎస్‌వీఆర్‌కే డిగ్రీ కళాశాలకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఇచ్చిన డిస్టెన్స్ స్టడీ, ఎగ్జామ్ సెంటర్‌ను రద్దు చేయాలని పీడీఎస్‌యూ కోరింది. ఈ మేరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిస్టెన్స్ ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.రామచంద్రన్‌కు వినతిపత్రం అందజేశామని నాయకులు శనివారం ఏలూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌వీఆర్‌కే కళాశాల కరస్పాండెంట్ పి.మురళీమోహన్ ఒకే భవనంలో ఎస్‌వీఆర్‌కే కళాశాల పేరున స్టడీ సెంటర్, శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల పేరున ఎగ్జామ్స్ సెంటర్ మంజూరు చేయించుకుని నాగార్జున యూనివర్సిటీ డిస్టెన్స్ ఎగ్జామ్స్‌లో మాస్ కాపీయింగ్ పాల్పడుతూ విద్యార్థుల నుంచి ప్రతి సెమిస్టర్‌కు రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకు వసూలు చేస్తున్నారని వివరించారు. ఫీజులు కట్టకపోతే సర్టిఫికెట్ ఇవ్వకుండా విద్యార్థులను మానసికంగా హింసించడం వల్ల ఇటీవల చేబోయిన అచ్యుత్ అనే విద్యార్థి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, సహాయ కార్యదర్శులు కాకి నాని, ఎ.రాజేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యం, సంరక్షణపైనా దృష్టి పెట్టాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ రత్న ప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థుల చదువులతో పాటు వారి ఆరోగ్యం, సంరక్షణపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్యానల్ లాయర్లతో కలిసి ఆయన శనివారం స్థానిక శనివారపు పేట జెడ్పీ హైస్కూల్, సుబ్బమ్మ దేవి హై స్కూల్, గాంధీ నగర్ మున్సిపల్ హై స్కూల్, సత్రంపాడు, వట్లూరు ఎంపీపీ స్కూళ్లను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజనానికి తయారుచేసిన ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణం, తాగునీటి సౌకర్యం, పాఠశాల పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. సత్రంపాడు హైస్కూల్ ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోవడం వల్ల విద్యార్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని, దీనిపై ప్రధాన ఉపాధ్యాయులు జిల్లా అధికారులను సంప్రదించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కూన కృష్ణారావు, పి.వెంకటేశ్వరరావు, జీవీ భాస్కర్, ఎ.గంగాభవాని, ప్యారా లీగల్ వాలంటీర్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి సంతకాల సేకరణ

దెందులూరు: దెందులూరు రైల్వే గేటు వద్ద ఓవర్ బ్రిడ్జిని సాధిస్తామని, 15 ఏళ్లుగా పోరాటం చేస్తున్న స్వచ్ఛంద సేవకుడు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ సాధన కమిటీ చైర్మన్ మద్ద భూషణం అన్నారు. శనివారం దెందులూరు, పెదవేగి, ద్వారకాతిరుమల మండలాల్లో ప్రజాప్రతినిధుల నుంచి ఆమోద పత్రాలను తీసుకున్నామన్నారు. మూడు రోజులుగా మూడు మండలాల్లో సంతకాల సేకరిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే భక్తులు ప్రయాణికులు దెందులూరు మీదుగా ద్వారకా తిరుమల వెళ్లడానికి రైల్వే గేటు వద్ద దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రయాణికులు భీమడోలు మీదుగా వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో అధిక సమయం, చార్జీల భారం అవుతోందని వేలాది మంది భక్తులు అభిప్రాయపడుతున్నారన్నారు. దెందులూరు రైల్వే గేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే భక్తులు, ప్రయాణికులు, వ్యాపారులు, పాదచారులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. దీనిపై అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోందన్నారు. ఇప్పటివరకు సేకరించిన సంతకాలు వినతిపత్రాన్ని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అందజేసి, ఆయన ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. పారిశ్రామిక వేత్త కలపాల చంద్రశేఖర్ (బుజ్జి) మాట్లాడుతూ దెందులూరు రైల్వే గేట్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూషణం చేస్తోన్న కృషి అభినందనీయమన్నారు. ఓవర్ బ్రిడ్జి సాధన ప్రక్రియ ముందుకు సాగేందుకు అవసరమైన సహాయసహకారాలు అందజేస్తామన్నారు. వంతెన నిర్మాణానికి మద్దతుగా ఆయన సంతకం చేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	12
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	21
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	02
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	01
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	07
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	05
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	06
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	06
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	07
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	05
ఏలూరు - తిరుపతి	16.00	4830	27

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44-48	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	56-96
వంకాయలు (కాంతులు)	40-60	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	52	ములక్కాడలు	07,10
బెండకాయలు	30	కంద	60
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	44-48
కాకర కాయలు	32-44	కీరా దోస	36
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	00
బీరకాయలు (పందిరి)	40	అల్లం	80-150
క్యాబేజీ	32-36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	40-48	పాలకూర	12
దొండకాయలు	28	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	30-54	గోంగూర	07
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	34-44	బఠాణీ	--
ఆనపకాయ (1)	30-40	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	40

కొట్లాటపై కేసు నమోదు

పెదవేగి : అన్యాయంగా ఓ వ్యక్తి దాడి చేసి తనను కొట్టాడంటూ గొల్లపల్లి ప్రసాద్ పోలీసులను ఆశ్రయించాడు. పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం నడిపల్లి ఆర్సీఎం చర్చి పక్కనగల గ్రౌండ్‌లో వాలీబాల్ మ్యాచ్ జరుగుతుండగా ఫిర్యాది గొల్లపల్లి ప్రసాద్ వెళ్లి స్కోర్ ఎంత అని అడగ్గా అతడిపై నడిపల్లి గ్రామానికి చెందిన పింగళి రవి దురుసుగా వ్యహరించి దుర్భాషలాడుతూ అక్కడే ఉన్న ఎడ్ల బండి కర్రతో దాడి చేసి ఎడమ చేయి మణికట్టుపై బలంగా కొట్టాడు. దీంతో బలమైన గాయమైనట్టు ప్రసాద్ తెలిపారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఫిర్యాది ప్రసాద్ స్టేట్‌మెంట్ ఆధారంగా ఎస్సై కె రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీల నివారణ, భద్రతపై అవగాహన



ఎల్‌హెచ్‌ఎంఎస్ పై అవగాహన కల్పిస్తున్న సీసీఎస్ ఎస్సైలు శ్రీనివాసరావు, శేఖర్, శ్రీధర్

ఏలూరు టౌన్: నేరాల నివారణకు సహకరించాలని సీసీఎస్ ఎస్సైలు బుద్దాల శ్రీనివాసరావు, ఏసీహెచ్ శేఖర్, కె.శ్రీధర్ ప్రజలను కోరారు. చోరీల నివారణ, భద్రతపై ఏలూరు అశోక్‌నగర్‌లోని రాజ్యలక్ష్మి అపార్ట్‌మెంట్స్‌లో అవగాహన కల్పించారు. డోర్ టూ డోర్ సెక్యూరిటీ ఆడిట్, లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టంను వివరించారు. అపార్ట్‌మెంట్స్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సీసీ టీవీ ఆన్‌లైన్ లింకులను పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేయటం ద్వారా నిత్యం పోలీస్ బృందాలు పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావటంతో నేరాలు పెరిగిపోయాయనీ, అదే సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను అడ్డుకోవచ్చని సూచించారు. లేటెస్ట్ టెక్నాలజీ సీసీ టీవీ కెమెరాలను వినియోగించటం ద్వారా నేరాలను అడ్డుకోవచ్చన్నారు. ప్రజలు ఎవరైనా ఇతర ప్రాంతాలకు వెళ్లే క్రమంలో సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా పోలీస్ సిబ్బంది పర్యవేక్షిస్తారని తెలిపారు. ఇంటి యజమానులు తమ మొబైల్ ఫోన్లలో ఇంటిని పరిశీలించుకునే అవకాశం ఉంటుందన్నారు.

మద్యం వ్యాపారులపై కూటమి నాయకుల దందా

- నియోజకవర్గ ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే మద్యం షాపులు
- లాభాల్లో 30 శాతం వాటా ఇవ్వాలని హుకుం
- సిండికేట్ చక్రం తిప్పుతున్న జనసేన పక్షాన చేరిన టీడీపీ నాయకుడు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఉంగుటూరు నియోజకవర్గంలో మద్యం షాపు నడవాలంటే నియోజకవర్గ ప్రజాప్రతినిధిని ప్రసన్నం చేసుకోవాల్సిందే. ఇది ఒక ప్రైవేటు శాసనంగా అమలవుతోంది. లాటరీ ద్వారా ప్రభుత్వం విధానాలకు అనుగుణంగా మద్యం షాపులు మంజూరైనా ఇక్కడ వ్యాపారం చేయాలంటే నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధి, ఆయన ముఖ్య అనుచరుల అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మద్యం వ్యాపారంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు, స్థానిక నాయకుల జోక్యం అధికమైందని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. వ్యాపారులను బెదిరించి మరీ సిండికేటులో చేరాలని కూటమి నాయకులు ఆదేశిస్తున్నారు. ఈ విషయంలో నియోజకర్గ ప్రజాప్రతినిధి అనుచరుడు, జనసేన పక్షాన చేరిన టీడీపీ మండల నాయకుడు ఒకరు చక్రం తిప్పుతున్నారని తెలిసింది. ఉంగుటూరు మండలంలో ఏడు మద్యం దుకాణాలు వచ్చాయి. నియోజకవర్గం పరిధిలో 21 మద్యం షాపులకు అనుమతులు మంజూరయ్యాయి. లాభాల్లో 30 శాతం ఇవ్వాల్సిందేనని, లేకపోతే ఇబ్బందులు తప్పవని మద్యం షాపు దక్కించుకున్నవారిని కూటమి నాయకులు బెదిరిస్తున్నారు. ఇప్పటికే ఐదుగురు వ్యాపారులు కూటమి నాయకులతో వివాదం ఎందుకులే అని వారు చెప్పిన దానికి అంగీకరించినట్టు తెలిసింది. మరి కొందరు వ్యాపారులు తామెందుకు అంత శాతం వారికి ఇవ్వాలని అడ్డం తిరిగినట్టు సమాచారం. అంత మొత్తంలో ఎక్కడి నుంచి తెచ్చి ఇవ్వగలమని మద్యం షాపు యజమానులు తలలు పట్టుకుంటున్నారు. ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ సిబ్బందికి ముడుపులు చెల్లిస్తూ, స్థానిక రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు లాభాల్లోంచి 30 శాతం ఇవ్వడం అసాధ్యమని మద్యం షాపులు దక్కించుకున్న వారు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి, నిడమర్రు, గణపవరం, భీమడోలు మండలాల్లోనూ నెలకొంది. జనసేన, టీడీపీ నాయకులు దందా సాగిస్తూ నియోజకవర్గ ప్రజాప్రతినిధికి మేలు చేసేందుకు మద్యం వ్యాపారులను బలి చేస్తున్నారని సమాచారం. ఇప్పటికే మద్యం షాపులు దక్కించుకున్న వారిని బెదిరించడం, వారిని సిండికేటుకు రావాలంటూ హుకుం జారీ చేస్తూ ఒత్తిడి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నామినేటెడ్‌తోపాటు ముఖ్య పదవులు ఆశిస్తున్న కొందరు కూటమి నాయకులు నియోజకవర్గ ప్రజాప్రతినిధిని ప్రసన్నం చేసుకోవడానికి అత్యుత్సాహం చూపిస్తున్నారనే విమర్శలున్నాయి.